# తెలుగు హాస్యము

## ఫస్ట్ కేస్

ఏజెంట్ల మీటింగు అయిపోయింది. అందరూ ఎవరిదారిని వారు వెళ్ళిపోతున్నారు. తాము ఆ సంవత్సరంలో చేయించిన బిజినెస్‌కు, తమకు రావలసిన కమిషన్ తీసుకొని, సంతోషంగా వెళ్ళిపోయినారు చాలామంది.

ఈశ్వరరావు మటుకు ఒక్క దమ్మిడీ అయినా తీసుకోకుండా ఒట్టిచేతులతో వస్తున్నాడు. అందుకనే అతడు చాలా విచారంగా కూడా ఉన్నాడు.

జనరల్ మేనేజరు పిలుస్తున్నారని ఈశ్వరరావుకు కబురు వచ్చింది. అతడు వెళ్ళి ఆయనకు ఎదురుగా కూర్చున్నాడు.

మేనేజరు అన్నాడు, 'ఏమండీ. మీరు ఏజెన్సీ పుచ్చుకొని అయిదారు నెలలు అయింది. ఒక్క కేసు అయినా పంపలేదు. ఏమిటి సంగతి?'

'నా లోపంలేకుండా కృషిచేస్తున్నాను. కాని కలిసి రావటంలేదు. అదృష్టంలేదు' అన్నాడు రావు.

'మిస్టర్ రావు ఇన్స్యూరెన్సులో అదృష్టమూ, దురదృష్టమూ అంటూ ఏమీలేవు! నీవు బాగా పనిచెయ్యాలి?'

'ఏమి చేయమంటారు?'

'నీవు ప్రతి నిమిషమూ కూడా ఇన్స్యూరెన్సును గురించి ఆలోచించాలి!'

'ఇన్స్యూరెన్సును గురించి పుస్తకాలు చదువుతున్నానండి!'

'చదువుతున్నావా ? అయితే ఆపేసెయ్యి. అల్లాంటి పిచ్చిపనులు ఏమీచేయకు. పుస్తకాలు చదవటంవల్ల బిజినెస్ వృద్ధిగాదు. మానవజీవితాన్ని తెలుసుకో. తెలిసిందా?'

ఈశ్వరరావు తెలిసినట్లు తలఊపాడు. మేనేజరుమళ్ళీ ఇట్లా అన్నాడు. 'మనిషి తన భవిష్యత్తునుగురించి సాధారణముగా ఆలోచించడు జరిగిపోతున్నంతకాలం. ఆవిషయంనీది అతని భవిష్యత్తును గురించి ఆలోచించవలసినపనినీది. తెలిసిందా ?'

'తెలిసిందండి. ప్రతివాడూ తన ముందుగతిని గూర్చి ఆలోచించడు. వాడుచస్తేవాడిపెళ్ళాం, వాడిబిడ్డలగతి ఏమౌతుందా అని నేను దిగులుపడి వాడికేదో ఒక ఉపాయంఆలోచించి చెప్పాలె!'

'ఇన్స్యూరెన్సు ఏజెంటు పనే అది!' అన్నాడు మేనేజరు నవ్వుతూ.

ఈశ్వరరావు చిన్నవాడు. పనికొచ్చేవాడు. అతనికి తగినంత ప్రోత్సాహమిచ్చి ఎట్లాగైనా అతనిద్వారా బిజినెస్ రాబట్టాలని మేనేజరు గట్టిగా పట్టుపట్టాడు.

'మిస్టర్ ఈశ్వరరావ్ పట్టుదలతో పనిచేయాలె మీరు. ప్రొద్దున లేచినప్పటినుండి అదే ఆలోచన ఉండాలె.'

'రైల్లో ప్రయాణంచేస్తున్నావనుకో, ఆకాలంవృథాచేయకూడదు. ఇన్స్యూరు చేయటంవలన కలిగేలాభాలూ, ఇన్స్యూరు చేయకుండాపోయిన వాళ్ళపెళ్ళాంబిడ్డలుపడ్డబాధలూ ఈ విషయాలనుగురించి కథలు చెప్పాలె. అందులోఒకడికో, ఇద్దరికో నీవు చెప్పిందినచ్చుతుంది. నీకృషిఫలిస్తుంది.పట్టుదల ఉండాలె.' అని ఇల్లాగఎంతోసేపుప్రోత్సాహకరమైనమాటలు

చెప్పాడు.పాపం ఈశ్వరరావు ఒట్టిచేతులతో వెళ్ళుతున్నాడే అని జాలికూడా కలిగింది ఆయనకు. అందుకని అతనికి ఒక యాభై రూపాయలుఎడ్వాన్స్‌కూడా ఇప్పించిదీవించిపంపాడు.

ఈశ్వరరావు సంతోషించాడు. బి. ఏ. ప్యాసుఅయిన కుర్రవాడు. తెలుగులోకూడా బాగా మాట్లాడగలడు.

ఇప్పుడు అతడికిబాగా ప్రోత్సాహం కలిగింది.పట్టుదల అతని గుండెపైన పీఠంవేసుకొని కూర్చున్నది. ఏమైనాసరే రోజుకు ఒక కేసు అయినా పట్టంది భోజనం చేయకూడదని నిశ్చయించుకొని స్వగ్రామం వెళ్ళిపోవటానికిబయలుదేరాడు

ఈశ్వరరావు ఈతఫా గట్టి పట్టుపట్టాడు. బెజవాడచేరటంతోనే మెడలువిరిచి అయినాసరే ఎవరినో ఒకరిని ఇన్‌స్యూరు చేయిస్తాడు. అంత పట్టుదల అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తూనే ఉంది.

౨

ఈశ్వరరావు గబగబా పరుగెత్తుకుంటూవెళ్ళి రైలు ఎక్కాడా. ఖాళీగా ఉన్న ఒక పెట్టెలోఎక్కి ఒక బెంచీపై కూర్చున్నాడు.

మేనేజరు చెప్పినమాటలు, అతని చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి. ఇది రైలుపెట్టెగదా అని ఊరుకో కూడదు. ఇక్కడకూడా తన వేట సాగించాలె.

తనకు ఎదురుగాఉన్న బెంచీపైనఇరవై ఏండ్లకుర్రవాడు ఒకడు కూర్చొని ఉన్నాడు. విచారంగా దిక్కులుగా చూస్తున్నాడు. అతనేదో చిన్న ఉద్యోగిలాగ ఉన్నాడు బీదవాడు కూడా ఐతే కావచ్చు. అయితేమటుకేం ఆలోచించాల్సిన విషయమే !

ఈశ్వరరావు బాగా ఆలోచించాడు. తన ప్రయత్నాలు ఇప్పుడే ఆరంభిస్తే చాలా మంచిది. ఈతణ్ణి పట్టుకొని కొద్ది మొత్తానికైనా సరే ఇన్స్యూర్ చేయిస్తే ఎల్లాగుంటుందీ ఆలోచన తట్టింది.

ఈ ఆలోచనే చాలా బాగుంది. ఇది అతని మొదటి కేసు. మొదటి ప్రయత్నంలోనే నెగ్గాలె.

ఈశ్వరరావుకు ఈబిజినెస్ అంటేమొదటినుంచీఇష్టం. తన భవిష్యత్తును గురించి బాగాఆలోచించే చివరకుఇన్స్యూరెన్సు ఏజంటుగా కుదురుకున్నాడు.

ఇన్నాళ్ళబట్టీ ఒక్క కేసుఅయినా చేయించలేకపోయిన మాట నిజమేకాని ఇవ్వాళ అట్లాకాదు. ఆ యెదురుగా ఉన్న కుర్రవాడిని చూచీచూడటంతోనే తెలిసింది యీశ్వరరావుకు తన అదృష్టరేఖ బైటపడ్డదని.

అతడు తనకు కలుగబోయే అదృష్టాన్ని గురించి ఎక్కువగా ఊహించుకొంటూ పోయినాడు. ఇదితప్పకుండా నెగ్గుతుంది. ఆ తరువాత అతడు పట్టిందల్లా బంగారం కావచ్చు. బిజినెస్ వృద్ధిఅవుతుంది. నెలకు వందా, రెండు వందలుకూడా సంపాదిస్తూ ఉంటాడు. తరువాత రిన్యూయల్ ప్రీమియమ్ యొక్క కమీషనుమీదనే హాయిగా జీవించే రోజులు రావటానికి కూడా ఎంతోకాలం పట్టకూడదు.

ఇంతకూ తనకు పట్టబోయే అదృష్టమంతా యీ మొదటి కేసులో తనకు విజయం కలగటంపైనే ఆధారపడి యున్నది. ఎట్లాగయినాసరే కుర్రవాణ్ణి పట్టితీరాలె.

౩

ఈశ్వరరావు ఆ కుర్రవాడి దగ్గరజేరి అతన్ని మెల్లగా మాటలలోకి దించాడు. అతని సంగతి అంతా తెలుసుకొంటా నికి ఎంతోసేపు పట్టలేదు.

ఆ అబ్బాయి ఒక బడిపంతులు. కొద్ది జీతంమీదనే ఎల్లాగో జీవిస్తున్నాడు.

ఇక ఆ అబ్బాయి భవిష్యత్తునుగురించి బాగా ఆలో చించవలసిన బాధ్యత తనది, మానేజరుగారు చెప్పినట్లు.

సంసారం కొద్దే కాబట్టి ఇప్పుడెట్లాగో గడుస్తున్నది ఆ అబ్బాయికి, ముందు ముందు ఎల్లాగు?

బ్రతికిఉంటే తల తాకట్టుపెట్టి అయినా సరే ఎల్లాగో పెళ్ళాము బిడ్డలను పోషిస్తాడు అనుకొందాము. కర్మంచాలక అతడు కాస్తా హరీఅంటే వాళ్ళగతి ఏమికావాలె! కాబట్టి ఈ విషయం నచ్చచెప్పి అతనొక పాలసీ పుచ్చుకొనేటట్లు చేయక తప్పదు.

అయితే ఆ కుర్రవాడు ఏమంత తెలివైన వాడులాగ కనిపించలేదు. ఏదో మందమతిలాగా ఉన్నాడు. ఎందుకూ అంటే ఆ జవాబులు ఏదో పరధ్యాన్నంగా, ఎక్కడో చూస్తూ ఏదో ఆలోచిస్తూ చెప్పాడు.

అయితేనేమి? అల్లాంటివాణ్ణే కాస్త దారికి తీసుకొని వచ్చి ఒక పాలసీ తీసుకొనేలాగుచేస్తే ఒక బీదసంసారాన్ని రక్షించిన పుణ్యం దక్కుతుంది.

ఈశ్వరరావు పట్టుదలతో, పని ప్రారంభించి ఆపంతు లును క్రమంగా సంభాషణలోకి లాగి జీవితం అశాశ్వతం అనే విషయంలోకి దింపాడు.

ఇల్లా అన్నాడు. 'చూడండి. ఈ బ్రతుకు శాశ్వతం కాదు. 'అనిత్యాని శరీరాణి' అన్నాడు. ఇప్పుడుఇల్లాగకులా సాగా మాట్లాడుతున్నాము, కాని ఇంకా కాసేపటికి ఏమి జరుగుతుందో ఏమీచెప్పలేము.'

ఆ అబ్బాయి ఊరుకొన్నాడు, వినీ విననట్లు, అవు ననలేదు' కాదనలేదు. ఎదో తియ్యనిమత్తులో ఉన్నట్లు చూస్తూ కూర్చున్నాడు.

'చూశారూ, పంతులుగారూ! బండి ఇప్పుడు ఈ వం తెనమీదుగా పోతున్నది. కాని ఈవంతెన కపీమని విరిగి పోయి, రైలు పడిపోయి రైలులోని ప్రయాణికులలో కొందరు చనిపోవచ్చు! అల్లా చాలాచోట్ల జరిగింది!'

అటు చూస్తున్న పంతులు ఇటుతిరిగి ఈయన చెప్పే మాటలు వింటానికి కాస్త ఆసక్తి కనపరచాడు.

ఈశ్వరరావు ధైర్యంతో మళ్ళీ ఇట్లా అన్నాడు" 'నిత్యం సన్నిహితో మృత్యుః' అన్నాడు. మృత్యువనేది ఎల్లప్పుడూ మనలను అనుసరిస్తూ గబుక్కున మీదపడు తుంది. ఎప్పుడో ఒకప్పుడు! ఏ రూపంతో వస్తుందో చెప్ప లేము. ఒకసారి, దారినిపోతూఉన్న రెండెడ్లబండి విరిగి ఒక కుర్రవాడిమీద పడ్డది. వాడి ప్రాణాలు అక్కడేపోయినాయి.'

పంతులు ఈ మాటలు విని చాలా ఆశ్చర్యపడ్డాడు. అంతపని జరిగిందా అన్నట్లు తెల్లపోయి చూశాడు.

ఏజెంటు మహాశయునికి పట్టుదల ఎక్కువ అయింది. పంతులు వలలోపడేటట్లే ఉన్నాడు. ముఖంచూస్తే అల్లాగే

ఉంది. అందుకనే అతడొక చిన్న ఉపన్యాసం సాగించాడు. మధ్య మధ్య అతని ముఖంలోని మార్పులను గుర్తిస్తూ, ఉపన్యాసం అంతా విన్నాడు ఆకుర్రవాడు ఒకమాటైనా పలకకుండా.

చివరకు ఉపన్యాసకుడు అన్నమాట ఇది.

'సైకిల్ మీదనుంచిపడిఅక్కడేఆక్షణంలో, ప్రాణాలు విడిచినవాళ్ళుకూడా ఉన్నారు!'

ఆ అబ్బాయి ఏడుపుముఖం పెట్టాడు. అతని బుర్ర లోకి ఈతని మాటలు ఎక్కినవి. ఏజెంటు ఈశ్వరరావు చాలా సంతోషించాడు. ఇంతకూ మేనేజరు చెప్పినట్లు పట్టు దలఉంటే సరి, అదృష్టం అదే కలిసివస్తుంది. తనమాటలు ఆ కుర్రవాడికి బాగా నచ్చినట్లు తెలుస్తూనేవుంది. ఇక అతని చేత పాలసీ కొనిపించటానికి ఎంతోసేపు పట్టదని కూడా గ్రహించి, ఈశ్వరరావు కొంచెం గంభీరంగా ముఖంపెట్టి ఇట్లా అన్నాడు.

'పంతులుగారూ, ఒక్కమాట చెబుతానువినండి. మీరు ఏమీ అనుకోవద్దు. మీకు ఆస్తి ఏమీలేదు. ఏదో పల్లెటూరులో బడిచెప్పుకొని బ్రతుకుతున్నారు. ఏ ఆపదో వచ్చి అంటే ఇల్లాంటి ప్రమాదంకలిగి, మీప్రాణాలుకాస్తా గుటుక్కుమంటే మీ పెళ్లాంగతి యేమికావాలె! నీ బిడ్డలగతి యేమికావాలె? వాళ్ళు అన్నంలేక మాడిచస్తారు! అవునా, కాదా?

దీనికి జబాబుగా పంతులుఏమంటాడోనని ఈశ్వరరావు అతనివంకేచూస్తున్నాడు. పంతులు, అతడుఅడిగినదానికిజవా

ఋగా అవునని తలఊపుతూ చూస్తూ ఉండగానే గొల్లుమని ఏడ్వటం సాగించాడు.

. అరె ! ఇంతపని జరుగుతుందని ఆ ఏజెంటు అయినా ఎప్పుడూ అనుకోలేదు. అతను ఆశించినది అయినా ఏదో అయిదువందల పాలసీ! నెలకు రెండురూపాయిలు ప్రిమియమ్ కడితే చాలు.

ఈ పాలసీమాట ఎత్తకముందే ఈపంతులుగారుఇట్లాగ ఏడుస్తాడని ఆయన కలలోనైనాఅనుకోలేదు. ఇదిచాలా విచిత్రంగా ఉంది. అదీకాక అతనికి ఏమిచేయటానికి తోచలేదు.

ఆ ఏడ్పుచూచి, ఆ పెట్టెలో ఉన్నవాళ్ళంతాఅంతకు ముందు మాట్లాడుతూ ఉన్నవాళ్ళల్లా చప్పున ఆగిపోయి కుర్రవాడివంకా, ఆ ఏజెంటువంకా చూడటం మొదలు పెట్టారు. వాళ్ళకు ఏమీ తెలియలేదు. ఇద్దరూ కుర్రవాళ్ళ లాగే కనపడ్డారు. వాళ్ళకు వీళ్ళిద్దరూకూడా మాటామాటా అనుకున్నారేమోనని అనుమానం కలిగింది.

ఆ పంతులు ఏడ్పు ఆపలేదు. 'అంతే, నీవు అన్నది నిజం! నిజం కాకపోతే ఎందుకు అంటావులే!' అని అంటూ ముఖాన గుడ్డ అడ్డుపెట్టుకొని ఏడ్వటం సాగించాడు.

ఆ అబ్బాయిమీద అందరికి చాలా జాలికలిగింది. ఈ ఏజెంటు ఏదో మాటఅంటే ఆ కుర్రవాడు ఏడుస్తున్నాడు. ఇదీ అంతా అనుకొన్నది.

'ఎందుకయ్యా, ఆ అబ్బాయిని ఏడ్పించటం,' అన్నారు కూడా ఒకరిద్దరు పెద్దవాళ్లు. పాపం; ఈశ్వరరావు మటుకు ఏమంటాడు! తెల్లపోయి చూస్తూ కూర్చున్నాడు.

ఆయనేకాదు. అందరూకూడా నిశ్శబ్దంగా కూర్చు న్నారు. ఒక చిన్నవాడు అల్లాగ వెక్కి వెక్కి ఏడుస్తూఉంటే ఎవరికి బుద్ధిపుడుతుంది కులాసాగా మాట్లాడుకొంటానికి!

ఈశ్వరరావు తెల్ల ముఖంతో, భయంతో కూర్చోటం చూచి అంతా అనుకొన్నారు. 'వీడేదో అనే ఉంటాడు. లేక పోతే ఆ కుర్రవాడు ఎందుకు ఏడుస్తాడు!' ఆ కుర్రవాణ్ణి ఏడ్పించింది తానేనని అంతా అనుకోవటం ఈశ్వరరావుకు చిన్నతనంగానే ఉన్నది.

నాలుగు నిమిషాలు గడిచిన తరువాత పంతులు కాస్త తెప్పరిల్లాడు. ఆయన ఏడ్పు ఆపటం చూచి ప్రక్కనే కూర్చున్న ముసలమ్మ అన్నది 'నాయనా ఎవరో చిన్న వాడవు. నీ దుఃఖం చూస్తే నాకడుపు తరుక్కుపోతున్నది. ఏమిటి, నాయనా? ఎందుకూ ఏడుస్తావూ?' అని కళ్ళనీళ్ళు కూడా తుడుచుకొన్నది.

పంతులుబాబుకు నోటమాటరాలేదు. కళ్ళనిండానీళ్ళు పెట్టుకున్నాడు. దుఃఖపూరితమైన గొంతులోనుంచి అతికష్టం మీద ఒక్కమాట పెగిలింది: ఏడుస్తూనే అన్నాడు 'నాభార్య చచ్చిపోతుంది.' ఇక ఆపైన ఒక్క ముక్కఅయినా అనలేక ఆ ముసలమ్మగారిని కౌగిలించుకొని గొల్లు గొల్లున ఏడ్వటం మొదలుపెట్టాడు.

ముసలమ్మగారికికూడా దుఃఖంఆగలేదు.అకస్మాత్తుగా లభించినఈమనవణ్ణికౌగిలించుకొనే'ఊరుకోనాయనా' అమ్మా యికి జబ్బు ఎక్కువగా ఉందా ? ఫరవాలేదులే నాయనా. ఊరుకో, అనిఓదారుస్తూ, తానుకూడా పెద్దగానే ఏడ్చింది.

ఇల్లా ఓదార్పుమాటలు అంటూ ఉన్నపుడుమాత్రం కాస్త ఊరుకొని మళ్ళీ ఏదో జ్ఞాపకం రావటం, ఏడ్వటం, ఇదీ అతని వరస !

ఈశ్వరరావు ప్రాణాలు ఎక్కడపోయినయ్యో! అతడు ఎక్కడున్నాడో, ఏమి వింటున్నాడో, ఏమి చూస్తున్నాడో కూడా తెలిసికోలేని స్థితిలోఉన్నాడు.

౪

ఆ పెట్టెలో కూర్చున్న వాళ్ళందరికీ ఆ కుర్రవాడు ఎందుకు అంతగా ఏడుస్తున్నాడో సరిగ్గా తెలియదు. మొదట బెంచీలో వాళ్లు ఆయనభార్యకు ప్రాణంమీదికి వచ్చిందని అనుకున్నారు. మూడో బెంచీలోవాళ్లు ఆమె పోవటానికి కారణాలు కూడా పోగుచేస్తున్నారు !

కొంతమందికి ఈశ్వరరావుపైన కోపంకూడావచ్చింది. అతనివైపు కొరకొరచూశారు. ఈవెధవ కబురు ఇప్పుడే చెప్పకపోతేనేం ! రైలుదిగిన తరువాత చెప్పకపోయినాడా అని వాళ్లు అన్నారు.

ఈశ్వరరావుకూడా ఆఅబ్బాయి ఎందుకుఏడుస్తున్నాడని కొంచెం ఆలోచించాడు. అతనికి ఒకవిధంగా తోచింది. అతని భార్యకు బహుశః చాలాజబ్బుగా ఉండి ఉంటుంది. ఇంతకు పూర్వమే ఆయన ఈవిషయమై ఆలోచిస్తూ దిగులుపడి కూర్చునిఉంటాడు. మొదట్లో తన మాటవినకుండా పరధ్యాన్నంగా, దిగులుగా, ఉంటానికి కూడా అదేకారణం అయిఉండాలే !

నీ భార్యా, బిడ్డలు అన్నంలేక మాడి చచ్చిపోతారు అన్నాడే, ఆమాటలు, ఎందుకుఅన్నాడనసీ, ఏసందర్భంలో అన్నాడనసీ, అతన్నిమాత్రం చాలాకష్టపెట్టిఉంటవి. చాలా బాధకలిగి ఉంటుంది. అతనికి ఇదివరకేవున్న విచారానికిఇది తోడుకాగా, అతడు దుఃఖాన్ని ఆపుకోలేకపోయి ఉంటాడు. ఏజెంటు మహాశయుడు తనకున్న సైకో యనాలిసిస్ శాస్త్ర జ్ఞానం అంతా వినియోగించి, ఈ నిశ్చయానికి వచ్చాడు.

ఇంతలో పంతులు కాస్త దారికొచ్చాడు. ఏడ్వటం మాని దిగులుగా కూర్చున్నాడు. దుఃఖం కాస్త తగ్గిందికదా అని ముసలమ్మగారు ఇట్లా అన్నది. 'అట్లా ధైర్యంగాఉండు నాయనా ! ఏడిస్తే ఏమిలాభం?' ఆకుర్రవాడు పిచ్చిచూపులు చూస్తూ ఊరుకొన్నాడు.

'వాళ్ళిద్దరూ బావమరదులేటమ్మా!' అని చివర బెంచీలో ఎవరో అన్నారు. వాళ్ళకు ఈ సంగతిఎట్లా తెలిసిందో! ఎట్లాగు ఊహించారో మరి!

ముసలమ్మగారు ఇది నిజమో కాదో తెలుసుకొందామని అడిగింది 'ఏం నాయనా, ఐతే ఆయన అక్కను నీకిచ్చారా, నీ అక్కను ఆయనకిచ్చారా?'

ఈమాటలు వినేసరికి ఈశ్వరరావుకు పై ప్రాణాలు పైన పోయినై య్. ఆ అబ్బాయికీ తనకుకూడా బంధుత్వం కలుపుతున్నారు వీళ్ళంతా కలిసి! దీనికి సమాధానం ఆయనే చెబుతాడో, తననేచెప్పంటారో, అనిభయపడి చూస్తున్నాడు.

ఆ అబ్బాయి తలేడూపాడో, చెయ్యేడూపాడో, యేమి శాడో, తెలియదుకాని, మొత్తంమీద అందరికి ఇట్టే అర్థమైంది, వాళ్ళిద్దరూ బావమరుదులే నని !

ఇన్స్యూరెన్సు వ్యాపారం చేయటంలో ఇల్లాగఅనివార్యంగా క్రొత్తక్రొత్త బాంధవ్యాలు యేర్పడుతాయని పాపం ఈశ్వరరావుకు తెలియదు. అందుచేతనే అతడు చాలా గాభరాపడుతూ, కూర్చున్నాడు.

౫

క్రొత్తగా యేర్పడిన ఈబాంధవ్యాన్ని సమన్వయపరచుకొంటూ ఈఏజెంటూ, ఆయనకెదురుగా ఆపంతులూ కూర్చున్నారు. ముసలమ్మగారు మళ్ళీ అడిగింది 'నాయనా నీకేమన్నా బిడ్డలా?' అని.

పంతులు మాట్లాడకుండా ఒక వేలుఎత్తి చూపాడు. 'ఒక్కబిడ్డానాయనా? చిన్నతనంలోనేబిడ్డకలిగింది.' అంటూ ఆ అబ్బాయితల నిమిరింది. బిడ్డమాట ఎత్తేసరికిపంతులు. ఇందాకటికంటే కూడా పెద్దగా భోరున యేడ్వటం మొదలు పెట్టాడు.

ముసలమ్మగారు అన్నది. 'ఊరుకోవయ్యా ఆ బిడ్డను చూచుకొని అయినా బ్రతకాలా?' 'అబిడ్డకూడా బ్రతకదు ! అని అంటూ పంతులు ఏజెంటుగారి మెడకు వాటేసుకొని బుజంమీద తలవాల్చి యేడవటమే యేడ్వటం!! ఎవ్వరు, యేమి చెప్పినా వినక ఘోరంగా యేడ్వటం సాగించాడు.

పంతులు తనను కౌగలించుకొని యేడ్వటంతనకెంతో కష్టంగాఉన్నా, అక్కడున్న వాళ్లెవ్వరికీ యేమీకష్టంగాలేదు.

బావమరిదిని కౌగలించుకొని ఏడ్వటంలో విపరీతంఎవ్వరికీకన పడలేదు. కాని తను కూడా ఏడ్వకపోవటమే అందరికీ బహుశ; విచిత్రంగా ఉండిఉండాలె! ఎందుచేతనూ అంటే ఆ జబ్బుగా నున్న మనిషి సాక్షాత్తు తన అక్కనాయె!

తాను కఠిన హృదయుడని అప్పుడే అందరూ అనుకొంటున్నారు! కాదంటానికి తనకు ధైర్యం ఎప్పుడూ లేదు. చచ్చినట్లు, ఆ ఏడుస్తూ ఉన్న కుర్రవాడు తనఅక్క మొగుడని ఒప్పుకొంటానికిఈశ్వరరావు నిశ్చయించుకొనేఉన్నాడు కాని, తానుకూడా ఏడవవలసిన పరిస్థితి వస్తుందని అతడు ఎప్పుడూ ఊహించలేదు.

దీనిదుంపతెగ, ఈ ఇన్స్యూరెన్స్ ఇంత అవస్థలోకి దింపుతుందని తెలిసినట్లయితే మొదట్లోనే తప్పుకొనేవాడు.

కాని ఇప్పుడేమిచేస్తాడు? ఏడవక తప్పిందికాదు. అక్కకూడా పోయిందాయె! ఏడవకుండా ఎల్లాగ!పంతులును కౌగలించుకొని తప్పనిసరిగా ఏడ్చాడు.

అయితే ఒక్కసంగతి: అది బొల్లిబొల్లి ఏడ్పుమటుకు కాదు. ఏజంటుగారికి ఎందుకైనా కానీ, నిజమైన దుఃఖమే వచ్చింది. హృదయపూర్వకంగా ఏడ్చాదు!

ఉన్నవాళ్ళంతా, 'ఊరుకోండి నాయనా ఊరుకోండి! ఎందుకు ఏడ్వటం! ఏమిలాభం! అయిపోయిందాయె!'అంటూ బావమరదుల నిద్దరినీ కూడా ఓదార్చారు!

ముసలమ్మగారు ఈపర్యాయము ఈశ్వరరావును దగ్గరకు తీసికొని తల నిమురుతూ, అన్నది. 'పిచ్చిపిల్లవాడా! నీవుకూడా ఏడిస్తే ఎల్లాగ? కాస్త ధైర్యంతెచ్చుకో! మీ బావ

దిగులు పడిపోయినాడు! ఆయనకు కాస్త ధైర్యంచెప్పాలి సరదిపోయి ఏడిస్తే ఎల్లాగ చెప్పు!'

ఏజెంటు మహాశయుడు ముసలమ్మ మాటలు విని, వీద్వటం మానేశాడు.

పంతులుకూడా మానాడు కాని పూర్తిగా మానలేదు. కాసేపు ఊరుకొంటాడు. ఏదో జ్ఞాపకంవస్తుంది. మళ్ళీ ఏడుస్తాడు. ఇదీ అతని వరుస.

దుఃఖంవచ్చినవాడు తాను ఒక్కడే, తన ఇష్టం వచ్చినట్లు ఏడవక ఏజెంటు మహాశయుని కౌగలించుకొనియేడుస్తూ ఉండడం మూలాన, ఆయన ఏడ్చినప్పుడల్లా తానుకూడా యేడ్వవలసిన అగత్యం కలగటమే ఈశ్వరరావుకు ఇప్పుడు వచ్చిన క్రొత్త సంకటం!

దిగి పారిపోతే ఎల్లా ఉంటుందీఅని ఈశ్వరరావు ఆలోచించకపోలేదు. ఎట్లా దిగిపోవటం! అవతల బావను వదలి!

అంతగా మూర్ఖించిదిగితే, అంతా నీకేమైనాబుద్ధిఉందా లేదా? అని చీవాట్లు వేస్తారు. అంతటితో ఊరుకోరుకూడాను. అవతల ఆ అబ్బాయి కుళ్ళికుళ్ళి ఏడుస్తూంటే నీవు ఎట్లాగ వెడతావయ్యాఅని లాగి కూలేస్తారు! ఇంకా పెంకెతనంచేస్తే తలొక మొట్టికాయ మొట్టినా దిక్కులేదు. ఈశ్వరరావు ఈ విషయమై చాలా బాగా ఆలోచించి, దిగిపోవటానికివీలు లేదని నిశ్చయించుకొని అక్కడే కూర్చున్నాడు వీలైనప్పుడల్లా ఒకఏడుపు ఏడుస్తూ, స్టేషనులు వచ్చిపోతున్నాయి. పంతులు ఎక్కడా దిగి పోవాలని ప్రయత్నం చేయటమేలేదు,

బెజవాడ దగ్గరలోకి వస్తున్నది. ఏదో ఒక స్టేషనుతో బండి ఆగింది. ఆగే ఆగటంతోనే ఎవరో ఒకాయన వీళ్ళ పెట్టె దగ్గరకువచ్చి, తొంగిచూచి, 'ఇక్కడున్నాడ్రా!'అని పెద్దకేక పెట్టాడు. మరుక్షణంలో ఒక ముసలాయనకూడా పరుగెత్తూకుంటూ వచ్చి ఈ పెట్టెలోనే ఎక్కాడు.

ఆ వచ్చినవాళ్లు ఇద్దరూ పంతులకు చెరోప్రక్కనా కూర్చున్నారు. ఒకాయన అన్నాడు. 'ఓరి నీ దుంపతెగ! నీ కోసం వెదకలేక చస్తున్నాం, ప్రతిస్టేషనులోనూదిగి!' ఇంకో ఆయన 'ఇక్కడి కెప్పుడొచ్చావురా సన్యాసీ!' అన్నాడు,

వాళ్ళనుచూచి పంతులు మళ్ళీ ఏడ్పు సాగించాడు.

ముసలమ్మగారు అడిగింది వాళ్ళల్లో ఒకాయనను, 'నాయనా, ఆ అబ్బాయి మీకేమౌతాడు?'

'మా అబ్బాయి' అన్నాడు ఆ ముసలాయన.

'ఆయనా? అని రెండోవ్యక్తినిచూసి అడిగింది! 'వాడి మేనమామ!' అని జవాబు చెప్పాడు ఈ ముసలాయన.

ఈ జవాబులతో ముసలమ్మ తృప్తిపడి ఆ వచ్చిన వాళ్ళతో మళ్ళీ అన్నది. 'ఇందాకటినుంచీ ఒక్కటే ఏడ్పు మేమెంతచెప్పినా వినటంలేదు. ఆ బిడ్డను ఒంటరిగా వదిలేశారే బాబూ?'

ఆ ముసలాయన పిల్లవాణ్ణి కసురుకుంటూ అడిగాడు 'ఎందుకురా ఏడ్పు!" పిల్లవాడు పాపంబిక్కముఖం పెట్టాడు.

ఈ బిక్కమొఖంజూచి ముసలమ్మ జాలిపడిఅన్నది. 'కోప్పడకోకండి బాబుగారూ? యేడ్పు అంటే యేడ్పుగాక

ఏముంది! పాపం ఒక్క బిడ్డఆయెను! ఆబిడ్డకిఇల్లాంటిఇబ్బంది వచ్చిందేనని తల్చుకొనియేడుస్తున్నాడు.చిన్నవయస్సుఆయె! మనకుమల్లె డక్కా ముక్కాలు తిన్నాడా యేమన్నానా?'

ఆ ముసలాయన ముసలమ్మవంక విపరీతంగాచూచి 'వాడికి కూతురెక్కడిదమ్మా' అన్నాడు విసుగ్గా.

'లేదూ? అయితేపాపం, భార్య చావుకే కామాలు యేడుస్తున్నాడు' అన్నది ముసలమ్మ మళ్ళీ.

'ఛా ఛా యేమిటమ్మా నీమాటలు!. భార్య పోవటం యేమిటి?'

'ఆ అబ్బాయి తన భార్య పోయిందనేగా ఇందాకటి నుంచీ యేడుస్తూవుంటా?'

'ఛా, ఛా యేమిటమ్మా అసహ్యపుమాటలు! వాడి కింకా పెండ్లికాందే!' అన్నాడు ఆ అబ్బాయి మేనమామ.

పెండ్లికాకపోతే, ఈశ్వరరావు అక్క మొగడెట్లా అయినాడు! ఈశ్వరరావు గూడా ఎందుకు యేడ్చాడు? ఈ ప్రశ్నలకు సమాధానం యేజంటుగారే చెప్పాలిసిఉంది. అంతా ఆయనవంక వింతగా చూస్తునారు,

ఈశ్వరరావు చాలా చిక్కులో పడిపోయినాడు.ఇంత దరిద్రపు అవస్థలో అతడు ఎప్పుడూ పడలేదు. ఇప్పుడు తాను ఎవరని చెప్పాలె! ఎందుకు యేడ్చినట్లు !!

జరిగినవిషయమంతా పూసగుచ్చినట్లు చెప్పితే. అంతా నవ్వుతారు. హేళనచేస్తారు. చాలా అవమానం జరుగుతుంది. వాళ్లుఒకసారినవ్వి ఊరుకోరు.తనపేరూ,తనఇంటిపేరుకూడా అడిగితెలుసుకొని అందరికీకూడా చెబుతారు. ఊరంతా తెలు

స్తుంది. ఊరూర చెప్పుకొంటారు ఫలానిఇన్సూరెన్సు ఏజెంటు అని ఇల్లాగ జరిగిందీ అని !

ఇంతగొడవ జరుగుతుంది ! కాబట్టి ఏంచెయ్యాలె ? ఒక్కక్షణం ఆలోచనలో పడ్డాడు.

ఈశ్వరరావు ఇట్లా అనుకొంటూ ఉండగానే ముసలమ్మ మళ్ళీ అడిగింది. 'అయితే, పెళ్లామూ లేదు, బిడ్డా లేదు గదా ఎందుకుబాబూ మరి అల్లాగ ఒక్కతీరున ఏడ్చాడు'

ముసలాయన చీదరింపుగా అన్నాడు. 'వీడుఏడ్వటానికి ఏంలే! వీడికి ఏదో గుబులు.'

పిల్లవాడి మేనమామ అన్నాడు. 'వాడికి నెలరోజుల నుంచీ వంట్లో ఏమీ బాగుండటం లేదమ్మా...ఏదోఒకరకం పిచ్చిపట్టుకొంది. కూర్చుంటే ఎవ్వరితోనూ మాట్లాడకుండా గంటలకొద్దీ కూర్చుంటాడు. లేకపోతే ఎవ్వరినైనాకోప్పడ్డా వాడికి కష్టంకలిగేమాటఅన్నా, ఏడుస్తాడు.వాణ్ణివిశాఖపట్నం తీసికెడుతున్నాము. మందు ఇప్పించటానికి!'

పంతులు ఈమాటలు విని అప్పటికినోరువిప్పి మాట్లాడాడు. "పిచ్చి ఏమిటి నాన్నా! నేను ఎందుకు ఏడ్చానంటే నాకు పెళ్ళయినాగూడా. నాపెళ్లాం చచ్చిపోతుందనీ, నాకు బిడ్డపుట్టినా తరువాత అదీగూడాపోతుందనీఈయనచెప్పాడు!

అంతాగూడా ఈశ్వరరావువంక విపరీతంగా చూశారు. ఎందుకు అల్లాటి అభాగ్యపు మాటలు చెప్పాడా అని ఆశ్చర్యపోతూ !

'నేనుకూడా పోతానుట నాన్నా! ఈ రైలు విరిగో, వంతెనమీదినుంచి రైలుబండి పడిపోయో, నామీదుగా ఒక

కారుపోయో, నామీద ఒక ఎద్దుబండి విరిగో నేనుపోవటం నిశ్చయమేనట నాన్నా, అని మళ్ళీ ఏడ్చాడు ఆపిల్లవాడు.

ఈశ్వరరావు ప్రాణాలుపైనే ఎగిరిపోతున్నాయ్. ఏమి జవాబు చెప్పగలడు, ఎందుకు అల్లాంటిమాటలుఅన్నావంటే?

శివ, శివ ! ఈశ్వరరావు మనస్సులో పడుతున్నబాధ ఇంతా అంతా కాదు.

ముసలమ్మ అన్నది ఈశ్వరరావును చూస్తూ 'నీకేం పోయ్యేకాలంరా పాపం, పసిబిడ్డను పట్టుకొని అప్రాచ్యపు కూతలన్నీ కూశావు !"

ఒకాయన అన్నాడు. 'అక్కయ్య చచ్చిపోయిందని ఏడ్చావు ! అదేమిటి?'

అందరూ తనవైపే చూస్తున్నారు. ఇక లాభంలేదని బండి ఇంకా బాగా ఆగకమునుపే, ఈశ్వరరావు బెజవాడ ప్లాట్‌ఫారంమీదికి దూకి, మహాజనంలో కనపడకుండా కలిసిపోయినాడు.

ముసలమ్మా, ఆపెట్టెలో ఉన్న ఇతరపెద్దమనుష్యులూ అంతాగూడా అతనికి గూడా 'పిచ్చి'—అని నిర్ణయించారు.

—0—